

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

# ప్రజలకు అందుబాటులో ఉంటా..

- బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు, డిసెంబర్ 14: ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమే అని... తాజాగా ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని మాజీ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు. విజయాలు వచ్చినప్పుడు పొంగిపోవడం, అపజయం వచ్చినప్పుడు కుంగిపోవడం బీఆర్‌ఎస్ నైజం కాదన్నారు. పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు తనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. తాండూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు తాండూరు నియోజకవర్గానికి తీసుకొచ్చిన రూ.వేల కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు.

**17న మహాపడిపూజ**

తాండూరు పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు తాము నిర్వహించే అయ్యప్ప స్వామి మహా పడిపూజలకు నియోజకవర్గంలోని అయ్యప్ప స్వాములు, భక్తులు, నేతలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. లోక కల్యాణం, తాండూరు నియోజక వర్గం మంచి కోసం చేస్తున్న మహాపూజలో పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

# మరో శ్రీశైలం.. మరకత శివాలయం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్, యాదాద్రి గుడి రూపశిల్పి సుందర్‌రాజన్

శంకర్‌పల్లి, డిసెంబర్ 14 : భవిష్యత్తులో మరకత శివాలయం మరో శ్రీశైలం అవుతుందని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్, యాదాద్రి గుడి రూపశిల్పి సుందర్‌రాజన్ అన్నారు. 11వ శతాబ్దం నాటి ఈ మరకత శివాలయాన్ని కృష్ణ లీలతో ఆలయ పునర్నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. గురువారం మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివాలయాన్ని సందర్శించి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో చాణుక్యులు ప్రతిష్ఠించిన మరకత శివలింగం ఈ ప్రాంతంలో ఉండడం ప్రజల అదృష్టమన్నారు. నల్గొండ జిల్లా యాదగిరి గుట్టలోని లక్ష్మీనర్సింహస్వామి గుడిని నిర్మించిన శిల్పి సుందరరాజన్ సూచన మేరకు మరకత శివాలయాన్ని పునర్నిర్మాణానికి సంబంధించి గ్రామస్తులతో చర్చించి ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయానికి నాలుగు మూలలా విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రకాశం జిల్లా గూజేపల్లి నుంచి రాతిని తీసుకొచ్చి పూర్వంలో ఉన్న ఆలయాలు ఎలా ఉన్నాయో చందిప్ప శివలాయాన్ని అలా చూడబోతున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సదానందం గౌడ్, సర్పంచ్ స్వప్నామోహన్, ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దయాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అనంత పద్మనాభస్వామి ఆలయ హుండీ లెక్కింపు

**- కార్తిక మాసం నెల రోజుల ఆదాయం రూ.6,75,119**



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ అధికారులు

వికారాబాద్, డిసెంబర్ 14 : వికారాబాద్ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో గురువారం ఆలయ అధికారులు హుండీ లెక్కింపును నిర్వహించారు. ఇందులో భాగంగా కార్తీక మాసంలో నెల రోజులకు ఆలయానికి రూ.6,75,119 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, భక్తుల సమక్షంలో జరిగిందని ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ తెలిపారు.

# సమస్తం నిక్షిప్తం

- ఒక్కక్లిక్‌తో పూర్తి సమాచారం
- యూ డైస్ ప్లస్ వెబ్‌సైట్‌ను రూపొందించిన విద్యాశాఖ
- రంగారెడ్డి జిల్లాలోనూ కొనసాగుతున్న ప్రక్రియ
- జిల్లాలోని 3,126 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారమంతా ఒకే చోట నిక్షిప్తం
- ఈ నెలాఖరు లోగా పూర్తికి అధికారుల చర్యలు



ఆన్‌లైన్‌లో పాఠశాలల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

రంగారెడ్డి, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): 'విద్యా వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకే చోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 'యూ డైస్ ప్లస్' వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇకపై ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం కానున్నది. రంగారెడ్డి జిల్లాలోనూ విద్యాశాఖ అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టారు. 1 నుంచి 12 తరగతుల వరకు సమస్త విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల సమాచారాన్ని సేకరించి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలో ఉన్న 3,126 పాఠశాలల సమాచారం అంతా వెబ్‌సైట్‌లోకి అధికారులు అందుబాటులోకి తేనున్నారు. దీంతో విద్యార్థులకు ఇకపై ప్రభుత్వ పరంగా అందించే వసతులు, సదుపాయాల్లో పారదర్శకత పెరగనున్నది.'

**యూడైస్ నుంచి యూడైస్ ప్లస్‌గా మార్పు**

2021-22 వరకు యూడైస్‌గా కొనసాగగా.. గత విద్యా సంవత్సరం నుంచి యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)గా నవీకరించారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేయగా ఇకపై మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేయనున్నారు. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈవోలు, హెచ్‌ఎంల నేతృత్వంలో ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెలాఖరు వరకు అంశాల వారీగా వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు.

**సమస్త సమాచారం నిక్షిప్తం**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేటు విద్యా సంస్థల్లో కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు ఉండగా.. ప్రస్తుత సమాచారంతో అప్‌డేట్ చేస్తున్నారు. అలాగే పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలతోపాటు వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే జిల్లాలో శిక్షణ సైతం పూర్తి కాగా.. చాలా వరకు పాఠశాలల్లో వేగవంతంగా సాగుతున్నది. ఉన్నతాధికారులు స్వయంగా పాఠశాలలకు వెళ్లి నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్నారు.

**పెరగనున్న పారదర్శకత**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందుతున్న వసతుల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. అవినీతికి పాల్పడకుండా ఈ విధానం ఉపయోగపడనున్నది. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకే ఇకపై యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు. అన్ని పాఠశాలల సమాచారాన్ని సైతం వెబ్‌సైట్‌లో ఉండడంతో ఇక నుంచి ఆ వివరాల ఆధారంగానే పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు కానున్నాయి.

# మెట్రోరైలు ఏర్పాటు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 14 : మెట్రో ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వ ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. శంషాబాద్ నుంచి తుక్కుగూడ వయా కొంగరకలాన్ ఫాక్స్‌కాన్ వరకు మెట్రోరైలు ఏర్పాటు చేస్తామని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేశారని, అలాగే ఎల్‌బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఇబ్రహీంపట్నం నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రోరైలు ఏర్పాట చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొంగరకలాన్ సమీపంలో కలెక్టర్ కార్యాలయంతో పాటు ఫాక్స్‌కాన్ సంస్థ కూడా ఏర్పాటవుతుండడంతో మొదటి విడుతలోనే మెట్రోరైలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి గత ప్రభుత్వం సుమారు రూ.1500కోట్లను కేటాయిస్తూ ప్రొసీడింగ్‌లు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ ప్రొసీడింగ్‌లను యథావిధిగా కొనసాగించి మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా నగరశివార్లలో విస్తరించి ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఆయా మున్సిపాలిటీల్లో ప్రజల కనీస అవసరాల కోసం కేటాయించిన నిధులను రద్దు చేస్తే అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. వెంటనే ఆ నిధులను విడుదల చేస్తూ అభివృద్ధి పనులను యథావిధిగా సాగించాలన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పరిగి టౌన్, డిసెంబర్ 14 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు.. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో పరిగి సర్కారు దవాఖాన పోస్టుమార్టమ్ గదిలో భద్రపరిచారు. మృతుడు సమీపంలోని స్టీల్ కంపెనీలో పనిచేసే కార్మికుడుగా అనుమానిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

**అదుపుతప్పి లారీ బోల్తా..**

కొడంగల్ : అతివేగంతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జరిగింది. ఎస్సై భరత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ ప్రాంతం నుంచి షాద్‌నగర్‌కు వరి పొట్టు లోడ్‌తో వెళ్తున్న లారీ తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో బస్టాండ్ సమీపంలోని డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి క్రేన్, జేసీబీల సహాయంతో లారీని రోడ్డుపై నుంచి తొలగించారు. లారీలో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ వేగంగా నడుపడంతో బోల్తా పడిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# అందుబాటులో ట్రస్టు సేవలు

వికారాబాద్, డిసెంబర్ 14 : నిత్యం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఏఎం మెమోరియల్ ట్రస్ట్ సేవలు అందిస్తున్నదని ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణంలో ఏఎం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబులెన్స్ సర్వీసులను చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి.ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ ... వికారాబాద్ పట్టణంలో ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు వైద్య పరంగా అంబులెన్స్ సేవలు చేస్తామన్నారు. వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన నుంచి అతి తక్కువ ఖర్చుతో అంబులెన్స్ ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో షకీరా ఫకీర్ ఖాన్, తదితరులు ఉన్నారు.